

కుందుర్పిలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

కుందుర్పి : టిడిపి, వైసిపి నాయకుల వాడీవేడి ప్రసంగాల నేపథ్యంలో మండల కేంద్రంలో పోలీసులు ఏర్పాటు చేసిన పికెట్ మంగళవారం కూడా కొనసాగింది. గత ఆదివారం నిర్వహించిన 'ఇదేం ఖర్చు మన రాష్ట్రానికి' కార్యక్రమంలో టిడిపి నాయకులు మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో వైసిపి నాయకులు సైతం పోటాపోటీగా వ్యాఖ్యలు చేశారు. దీంతో టిడిపి-వైసిపి నాయకులు ఘర్షణ పడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మండలంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు మూడు రోజులుగా పికెట్ ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్నికల కోడ్ ఉండడంతో మండల ఇఒఆర్‌డి సదాశివ ఆదేశాల మేరకు టిడిపి నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరావుతోపాటు 19 మంది టిడిపి నాయకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక కార్యదర్శి విజయ్‌కుమార్

ప్రభుత్వ పథకాల పర్యవేక్షణతోనే సుస్థిరాభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా కార్యదర్శి జి.విజయ్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ పథకాల అమలును ప్రతి స్థాయిలోనూ ఉద్యోగులు సరైన విధంగా పర్యవేక్షణ చేయగలిగితే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సులభంగా సాధించగలమని ప్రభుత్వ ప్రణాళిక కార్యదర్శి జి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, స్పందన కార్యక్రమంపై జిల్లా స్థాయి ఓరియెంటేషన్, సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ కార్యదర్శి జి.విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ సుస్థిరాభివృద్ధి సూచీలతో మ్యాపింగ్ చేశారన్నారు. నాడు-నేడు, విద్యా దీవెన వంటి పథకాలతో నాణ్యమైన విద్యకు సంబంధించిన సూచీలు, సంపూర్ణ పోషణతో పసిపిల్లలు, గర్భిణుల ఆరోగ్య సూచీలు, క్లాప్‌తో పరిసరాల పరిశుభ్రత సంబంధ సూచీలను మ్యాపింగ్ చేశారన్నారు. ఉద్యోగులు తమ స్థాయిలో పథకాల అమలుపై బాధ్యతతో పర్యవేక్షణ చేయగలిగితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. సుస్థిర అభివృద్ధి అనేది కేవలం ఒక ఉద్యోగిగా నిర్వర్తించే బాధ్యత మాత్రమే కాదని ఒక మనిషిగా ప్రతి వ్యక్తీ తీసుకోవాల్సిన బాధ్యత అన్నారు. సుస్థిర అభివృద్ధి అంటే స్థిరమైన ఆర్థిక అభివృద్ధి సాధిస్తూనే పర్యావరణ పరిరక్షణ చేయడమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం ఉద్యోగుల సహకారం వల్లే విజయవంతమైందన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం స్పందన కార్యక్రమాన్ని అధ్యయనం చేసి తమ ప్రాంతాల్లో అమలు చేసేందుకు చొరవ చూపుతున్నాయన్నారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి ఉద్యోగస్తులు పరిష్కారాలు చూపగలిగితే స్పందన ఇంకా విజయవంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, గ్రామ వార్డు సచివాలయాల అడిషనల్ డైరెక్టర్ భావన వశిష్ట, పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధి అడిషనల్ కమిషనర్ మహేశ్ కుమార్, హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి, అనంతపురం కలెక్టర్ కేతన్ గార్గ్ (ఎఫ్ఎసి), శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, ఎస్పీ కాగినెల్లి ఫక్కీరప్ప, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, సీపీవో ప్రేమ్‌చంద్, ఆర్డీవో మధుసూదన్, ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ వైద్యం..అందని ద్రాక్షేనా..?

వేధిస్తున్న సిబ్బంది కొరత
మందులు లేక రోగుల ఇక్కట్లు
సిఐటియు ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో కార్మికులకు వైద్యం అందని ద్రాక్షగానే మారిపోయింది. ఈ ఆసుపత్రిలో 19 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా..ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఇక మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. కార్మికులు, పరిశ్రమ యాజమాన్యాల నుంచి ప్రతి నెలా డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ అందుకు తగ్గట్లుగా నాణ్యమైన వైద్యం మాత్రం అందడం లేదు. ఈఎస్ఐ ఆసుపత్రి సేవలను పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఎప్పటినుంచో కోరుతున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కార్మికులు నిట్టూర్చడం తప్ప చేసేదేమీ లేకుండా పోతోంది.

సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన

జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక్క అసుపత్రి ఈఎస్ఐ అసుపత్రి అని, ఈ అసుపత్రిలో సిబ్బంది లేక కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని, వెంటనే పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులను సరఫరా చేయాలని సిఐటియు సత్యసాయి జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి నరసింహప్పలు మాట్లాడుతూ ఈఎస్ఐ ఆసుపత్రి పరిధిలో దాదాపు 40 వేల మంది కార్మికులకు వైద్య సేవలు అందాలన్నారు. హిందూపురం చుట్టుపక్కల ఉన్న మండలాల్లో వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు వారి వేతనాల నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ చెల్లిస్తున్నప్పటికీ వారికి నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదన్నారు. ఆసుపత్రిలో 19 మంది సిబ్బంది ఉండాల్సి ఉన్నప్పటికి కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారన్నారు. ఉన్నవారూ సక్రమంగా పనిచేయటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని, పూర్తి స్థాయిలో మందులను సరఫరా చేసి, కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు చేయించుకుని వాటికి సంబంధించిన బిల్లులను సమర్పించి ఆరు నెలలు గడుస్తున్నా మంజూరు చేయడం లేదన్నారు. ప్రతి నెలా కార్మికులు ఈఎస్ఐ చెల్లిస్తూ, వైద్య సేవల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈఎస్ఐ కార్డు ఉన్నవారికి వైద్య సేవలు అందించడం లేదన్నారు. దీనికి ప్రధాన కారణం బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడమేనని పేర్కొన్నారు. ప్రతి నెలా ప్రభుత్వం ఈఎస్ఐ రూపంలో కార్మిక వేతనాలు నుంచి కోత విధించి ఖజానా నింపుకుంటోందే తప్ప కార్మికుల సంక్షేమాన్ని మాత్రం విస్మరించిందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలు దఫాలు ఆందోళనలు చేసి వినతులు సమర్పించినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అప్పటికీ సమస్యలను పరిష్కరించకపోతే ఆసుపత్రి ఎదుట నిరవదిక నిరాహార దీక్షకు సిద్ధమవుతామవుతామని హెచ్చరించారు. అనంతరం ఈఎస్ఐ డాక్టర్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, సిఐటియు పట్టణ కర్యదర్శి నరసింహప్ప, ఫ్రీ ప్రికాట్ బి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జయరాంరెడ్డి, కోశాధికారి నందీష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, రామచంద్ర, బాబయ్య, మూర్తి, ఆటో యూనియన్ పట్టణ కార్యదర్శి రామకృష్ణ, ఐరన్ ఫర్నీచర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జబీవుల్లా, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఈఎస్ఐ అసుపత్రి ఎదుట ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శ్రీనివాసులు



మాట్లాడుతున్న డాక్టరు డిఆర్.ప్రసాద్‌రాజు

పరిశోధన ప్రాజెక్టు నిధులు వర్సిటీ అభివృద్ధికి ఉపయుక్తం

జెఎన్‌టియు రీసెర్చ్ అడ్వయిజర్ డాక్టర్ డిఆర్.ప్రసాద్ రాజు

ప్రజాశక్తి-అనంతపురం

అధ్యాపకులు సాధించే పరిశోధన ప్రాజెక్టు నిధులు ద్వారా జెఎన్‌టియు అభివృద్ధికి మరింత ఉపయుక్తంగా ఉంటుదని అనంత జెఎన్‌టియు రీసెర్చ్ అడ్వయిజర్ డాక్టర్ డిఆర్.ప్రసాద్ రాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో డైరెక్టరేట్ అఫ్ స్పాన్సర్డ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ప్రపోజల్ ఫార్ డిఎస్‌టి అనే అంశంపై ఇంటరాక్ట్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జెఎన్‌టియు రీసెర్చ్ అడ్వైజర్ డాక్టర్ డిఆర్.ప్రసాద రాజు (రిటైర్డ్ సైంటిస్టు-జిడిఎస్‌టి) హాజరయ్యారు. రిసెర్చ్ సమస్యలను ఎలా గుర్తించాలి, ప్రతిపాదనలో ఏ అంశాలు విశదీకరించాలి, పరిశోధన ప్రతిపాదనలో వివిధ ఇబ్బందులను ఎలా అధిగమించాలో అధ్యాపకులతో చర్చించారు. డిఎస్‌టిలోని వివిధ స్కీం లకు ప్రతిపాదన ఎలా ఉండాలి, ఎంత మేరకు ఫండ్స్ పొందవచ్చునో అధ్యాపకులకు వివరించారు. అధ్యాపకులు పరిశోధనల ద్వారా గ్రాంట్స్ పొందడం వల్ల యూనివర్సిటీ యొక్క అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి అధ్యాపకుడూ తప్పని సరిగా పరిశోధన గ్రాంట్స్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య ఆర్.పద్మ సువర్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.భవాని, ఆచార్య విశాలి, ఆచార్య విబి.చిత్ర, డాక్టర్ కెఎఫ్‌ఫ్.భారతి, డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ మమత, డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ జె.శ్రీనివాసులు, డాక్టర్ లలిత, డాక్టర్ శివకుమార్, డాక్టర్ మాధవి, డాక్టర్ కళ్యాణి రాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

పౌర గ్రంథాలయ సంచాలకులు ఎంఆర్.ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పౌర గ్రంథాలయ సంచాలకులు ఎం.ఆర్.ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని మాంఛూఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గ్రంథాలయంలోని సిబ్బందిని కార్యదర్శి రమ పరిచయం చేశారు. తర్వాత గ్రంథాలయంలోని అన్ని విభాగాలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సంస్థ అధ్యక్షురాలు ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌ను సన్మానించారు. తర్వాత మహిళా గ్రంథాలయాన్ని సందర్శించి ఆడిటరియాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా ఆడిటోరియానికి కావాల్సిన ఫర్నిచర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపగ్రంథాలయ అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ శివశంకర్‌ప్రసాద్, లైబ్రేరియన్ ఇంతియాజ్ అహమ్మద్, రవికుమార్, కిరణ్, వెంకటేష్, రామాంజనమ్మ, కావేరి, బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నలపై ప్రభుత్వాల సవతి తల్లి ప్రేమ

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలక్రిష్ణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో చేనేతలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవితి తల్లి ప్రేమను చూపుతున్నాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలక్రిష్ణలు ఆరోపిం చారు. మంగళవారం ధర్మవరం పట్టణం మార్కెట్ వీధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో చేనేతల కోసం అనేక హామీలిచ్చి వాటిని నేటికీ అమలు చేయలేకపోతున్నారన్నారు. చేనేత పాలసీ అమలుచేస్తామని, 45 ఏళ్లకు పింఛన్ ఇస్తామని 50 ఏళ్లు అయినా పింఛన్ ఇవ్వలేదన్నారు. 50 ఏళ్ల వయస్సు ఉన్న నేతన్నలు ఏ పనీ లేరని, అటువంటి వారికి ఎలాంటి ఆంక్షలూ లేకుండా పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో ముద్రా రుణాలు ఇవ్వాలని.. పావలా వడ్డీ రుణాలు కూడా ఇవ్వాలన్నారు. ముడి పట్టు సరుకుల ధరలు పెరిగితే కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందే తప్ప వాటిని తగ్గించాలన్న ఆలోచన కూడా చేయలేదని మండిపడ్డారు. సెంట్రల్ శిల్క్ బోర్డు ద్వారా రేషం, వార్పులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేసి వాటిని సబ్సిడీతో చేనేత కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేశారు. పవర్ లూమ్స్ పట్టుచీరలు తయారు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు రూ.2 వేలు కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది బడ్జెట్ రూ.200 కోట్లు మాత్రమే కేటాయిస్తూ చేతులు దులుపుకుంటోందన్నారు. చేనేత కార్మికులు పనులు లేక.. వస్తున్న ఆదాయం సరిపోక.. అప్పులు చేసి వాటిని తీర్చలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అయితే ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం పరామర్శించిన దాఖలాలు కూడా లేవన్నారు. చేనేతకు కేటాయించిన బడ్జెట్ ఉద్యోగులకే సరిపోతోందని, కార్మికులకు ఏమిచ్చి ఆదుకుంటారని ప్రశ్నించారు. దీనికి తోడు చేనేతపై జీఎస్టీ విధించిందని వాటిని తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టా శివదుర్గారావు, అనుముల వీరబ్రహ్మం, రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగాధరరావు, సభ్యులు రాజు, ఓబులేసు, బషీర్ అహమ్మద్, నాయకులు చౌడప్ప, అన్నం సూర్యనారాయణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

గుంతకల్లులో ఇద్దరు దారుణహత్య

భూస్వామి జిపి.కోటిరెడ్డి, డ్రైవర్‌ను నరికిన దుండగులు - ఆస్తి తగాదాలే కారణమా..

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న 60 అడుగుల రోడ్డు కూడలిలో మంగళవారం సాయంత్రం ప్రముఖ భూస్వామి జిపి కోటిరెడ్డి (60), అతని డ్రైవర్ షేక్షావలి (24)ని దారుణంగా నరికి హత్య చేశారు. ప్రత్యక్ష సాక్షి, డ్రైవర్ తల్లి వహీదా తెలిపిన వివరాల మేరకు.. సాయంత్రం 5.30 సమయంలో ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి పాత గుంతకల్లుకు చెందిన రాముకు సంబంధించిన ఆస్తి పత్రాలను ఇవ్వాలని తమను పంపినట్లు డ్రైవర్ షేక్షావలితో చెప్పారు. దీంతో అతడు తన యజమాని కోటిరెడ్డిని అడిగి ఇంట్లోకి తీసుకెళ్లాడు. లోనికి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు రాముకు సంబంధించిన ఆస్తి పత్రాలను తమకు ఇవ్వాలని కోటిరెడ్డిని అడిగారు. దీంతో మాటామాటా పెరిగి ఆగ్రహించిన గుర్తు తెలియని వ్యక్తులు కోటిరెడ్డిపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. పక్కనే ఉన్న డ్రైవర్ అడ్డుకునే ప్రయత్నం చేయగా షేక్షావలిపై కూడా దాడి చేశారు. దీంతో తప్పించుకునే ప్రయత్నంలో డ్రైవర్ బయటకు వెళ్లడంతో ఓ వ్యక్తి వెంట పడి కత్తితో పొడిచి హత్య చేశాడు. ఇంట్లో ఉన్న మరోవ్యక్తి కోటిరెడ్డి గొంతును కత్తితో చూసి పారిపోయారు. ఘటనను చూసి భయపడిన వంట మనిషి వహీదా వంట గదిలోకి వెళ్లి తలుపుల గడి పెట్టుకుంది. సమాచారం అందుకున్న డీఎస్పీ యు.నరసింగప్ప, సీఐలు గణేష్, రామసుబ్బయ్య సిబ్బందితో గటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తర్వాత ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఇక్కడికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. తర్వాత మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మృతుడు కోటిరెడ్డి అమెరికాలోని భార్యా, పిల్లలను చూసుకుని 15 రోజులు క్రితమే గుంతకల్లు వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా ఆస్తి తగాదాలే ఇద్దరి హత్యలకు దారి తీసినట్లు పట్టణంలో ప్రచారం సాగుతోంది.



హత్యకు గురైన కోటిరెడ్డి, డ్రైవర్ షేక్షావలి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-రాయదుర్గం

శాసనమండలి ఎన్నికల్లో ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి అభ్యర్థిగా పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మంగళవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, క్రిసెంట్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మొదలైన చోట్ల ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ మార్చిలో జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున, చేనేత కార్మిక సంఘం నాయకులు మధు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలం కిష్టిపాడు గ్రామంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈమేరకు ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కృష్ణనారాయణ, సిపిఎం మండల సహాయ కార్యదర్శి మద్దిలేటి మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు పేదల పక్షాన ఉంటూ నిత్యం పోరాటాల చేస్తున్నారడన్నారు. కావున ఆయన్ను గెలిపించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టిపాడు వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కె.రంగస్వామి, పెద్దయ్య, హరిగోపాల్, శివకృష్ణ, కె.శివయ్య, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సికెం నాయకులు



విరాళం అందజేస్తున్న రామలింగారెడ్డి

ధ్వజస్తంభ ప్రతిష్టాపనకు విరాళం

బుక్కరాయసముద్రం : మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభం ప్రతిష్టాపనకు టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటిసి రామలింగారెడ్డి మంగళవారం రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పుడు, శుభ కార్యక్రమాలకు తనవంతుగా ఆర్థికసాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, అంజి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి 'అమ్మ' చేయూత



కృత్రిమ కాలు అందజేస్తున్న అమ్మ సంస్థ అధ్యక్షులు రమణారెడ్డి

అనంతపురం : రోడ్డు ప్రమాదంలో వెన్నెముక విరిగి ఇబ్బందులు పడుతున్న యువకుడికి అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. గతంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తల్లికి వెన్నెముక, కుమారుడు రఫీ కుడికాలు పూర్తిగా విరిగిపోయింది. విషయం తెలుసుకున్న రమణారెడ్డి తమ సంస్థ ద్వారా ఆ కుటుంబంలో మనోధైర్యం నింపేందుకు యువకుడికి ఆర్టిఫిషియల్ అవయవం తీసుకునేందుకు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఇటీవల రోడ్డు దాటుతున్న సమయంలో తల్లి కుమారుడు ఇద్దరు తీవ్రస్థాయిలో గాయపడి ప్రాణాలతో భయపడ్డారు. 18 సంవత్సరాల రఫీ పూర్తిగా కాలు కోల్పోవాల్సి వచ్చింది. తల్లి నూర్జహాన్ కూడా వెన్నెముక దెబ్బతిని రెండు నెల క్రితం మరణించింది. దీంతో తమవంతు సహాయంగా రఫీకి రూ.40 వేల విలువజేసే ఆర్టిఫిషియల్ అవయవాన్ని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ సంస్థ కార్యదర్శి రమణ, డాక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్‌కు విద్యార్థి ఎంపిక పట్ల హర్షం

రాయదుర్గం : రాయదుర్గం కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బిఎ 3వ సంవత్సరం చదువుతున్న బి.నరసింహులు ఇంటర్ యూనివర్సిటీ, సౌత్ జోన్ క్రికెట్ ఆటకు ఎంపిక కావడం గర్వకారణం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రఘురామమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల నుంచి ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ గేమ్స్‌కు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమన్నారు. నరసింహులు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఆటలో కూడా ప్రతిభ కనబరిచి రాణించాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

క్రాప్‌లోన్లు రెన్యువల్ చేసుకోండి

బుక్కరాయసముద్రం : సహకార సంఘం సొసైటీ బ్యాంకులో రైతులు తీసుకున్న క్రాప్‌లోన్లను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని చేసుకోవాలని సొసైటీ ఛైర్మన్ గువ్వల పెద్ద వెంకటరెడ్డి, సీఈఓ ముస్తఫా మంగళవారం ఒక ప్రకటనలు తెలిపారు. సహకారం సంఘం సొసైటీలో 1,754 అప్పుదారులు ఉన్నట్లు తెలిపారు. వీరందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వ పథకాలకు అనర్హులు అవుతారన్నారు. కావున రైతులు పట్టాదారు పాసు పుస్తకం, రేషన్, ఓటర్, ఆధార్ కార్డులతోపాటు ఫొటో, వన్‌బీ, సొసైటీ బ్యాంక్ పాసు బుక్కు రెండు పాస్‌ఫోటోలు తీసుకొచ్చి రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

భాగవత సప్తాహ పఠన శ్రవణ యజ్ఞం

నార్పల : మండల కేంద్రంలో స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఏడు రోజులు భాగవత సప్తాహ పఠన శ్రవణ యజ్ఞం నిర్వహించారు. ఇందులో భాగంగా 5వ రోజు మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్ర స్వామి భాగవత సప్తాహ పఠనం చేశారు. పఠనం చదువుతున్న భాగవతులు మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి ప్రజలకు తెలియజేస్తూ లోకకళ్యాణార్థం, సమాజంలో ఉన్న చెడు తొలగిపోయి ప్రజలందరూ భక్తి, సేవా మార్గంలో నడవడమ సనాతన ధర్మం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో తీగల నారాయణరెడ్డి, బయన్న, నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

15న ప్రత్యేక విద్యుత్ అదాలత్

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఈనెల 15న నిర్వహించనున్న ప్రత్యేక విద్యుత్ ఆదాలత్‌ను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విడపనకల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు కళ్యాణదుర్గం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 11:30 నుంచి 1:30 గంటల వరకు అధ్యక్షులు రామమోహనరావు, సాంకేతిక సభ్యులు ఎన్ఎల్.అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన అధికారులందరూ పాల్గొంటారని తెలిపారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుత్తి బస్టాండ్ స్థలం లీజ్‌పై అభ్యంతరాలు

ప్రజాశక్తి-గుత్తి



అభ్యంతరాలను తెలియజేస్తున్న లీజుదారులు

గుత్తి ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని లీజ్‌కు ఇవ్వాలన్న నిర్ణయంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ కార్యాలయంలో బస్టాండ్ ఆవరణలోని స్థలం లీజుదారులతో డిపో మేనేజర్ నారాయణస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా లీజుదారులతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అనంతపురం రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆంథోని, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేంద్రబాబు మాట్లాడుతూ బస్టాండ్లను అభివృద్ధి చేయడంలో భాగంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పలు బస్టాండ్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో తాడిపత్రి, గుత్తి బస్టాండ్లను అధునీకరణ, అభివృద్ధి చేసేందుకు బస్టాండ్ స్థలాన్ని ప్రయివేట్ కంపెనీలకు 33 ఏళ్లపాటు లీజ్‌కు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండు, వివిధ గదులు, వాణిజ్య దుకాణ సముదాయాలు నిర్మించేలా లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు ఐటిసి కంపెనీ డిస్ట్రిబ్యూటర్ మాకం శ్రీకాంత్, స్థలం లీజుదారులు మహబూబ్ బాషా (టిప్పు), సూరి, రాజశేఖర్‌రెడ్డితో పాటు పలువురు అభ్యంతర వ్యక్తం చేశారు. బస్టాండ్ అభివృద్ధి చేసే నమూనాను కూడా చూపించకుండా లీజ్‌కు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తాము ఇప్పటికే ఆర్టీసీ స్థలాన్ని లీజు విషయమై ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఇప్పుడు మరొకరికి లీజ్ కిస్తే మా పరిస్థితి ఏంటి అని నిలదీశారు. ఆర్టీసీ అధికారులే బస్టాండ్లను అభివృద్ధి చేయాలని కోరారు. అధికారులు మాత్రం ఇది ప్రభుత్వ నిర్ణయం అని లీజు దారులకు వ్యాపారులకు నష్టం వాటిల్లకుండా ఉండాలని ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు చెప్పారు. అందరి అభిప్రాయాలను సేకరించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పామిడి ఎంపిపి బోగాతి మురళీమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం



రైతు భరోసా కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్.లక్ష్మానాయక్

మండలంలోని ఆవులదట్ల రైతు భరోసా కేంద్రాన్ని రాయదుర్గం డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్.లక్ష్మానాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులు పండించిన పప్పుశనగను రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కావున రబీ సీజన్ 2022–23లో పప్పుశెనగ సాగు చేసిన రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రాయదుర్గం నియోజకవర్గంలోని వ్యవసాయ యంత్ర సేవా కేంద్రం పథకం కింద ఇప్పటివరకు ఎలాంటి పరికరాలు కొనుగోలు చేయని రైతు భరోసా కేంద్రాలకు 40 శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతు గ్రూపులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలతో సహా ట్రాక్టర్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి మాసం రైతు భరోసా మాసపత్రికను పొందేందుకు ప్రతి రైతు సంవత్సరం రూ.300 చందాను చెల్లించాలని కోరారు.

సైకిల్ తొక్కి ఆరోగ్యాన్ని కాపాడుకోండి

రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేష్

ప్రజాశక్తి-ఉరవకొండ



సైకిల్ తొక్కుతూ అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అమిద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాకెట్ల పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 'సైకిల్ తొక్కండి.. ఆరోగ్యాన్ని పొందండి' అనే కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైకిల్ తొక్కడం వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలను వైద్యాధికారి వివరించారు. రోజూ క్రమం తప్పకుండా సైకిల్ తొక్కితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా మధుమేహం, గుండె, ఊపిరితిత్తులు, ఊబకాయం లాంటి జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అలాగే పర్యావరణంలో వాయు, శబ్ద కాలుష్యం తగ్గడమే కాకుండా, త్వరగా గమ్యాన్ని చేరడానికి,ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సైకిల్ తొక్కడం దోహదపడుతుందని తెలిపారు. ఎక్కువగా ద్విచక్ర వాహనాలు వాడడంతో పెట్రోలు, డీజిల్ వినియోగం పెరిగి విదేశీ మాదక ద్రవ్యం నిలువలు తగ్గి దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. అదే సైకిల్ వాడకంతో దేశ ఆర్థిక వ్యవస్థకు మంచి చేసిన వారు అవుతామన్నారు. కావున ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కే అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, ఎంఎల్‌హెచ్‌పిలు భావానీ, భారతి, సిఒ భగవాన్ దాస్, ఎంపిహెచ్ఎ ముకుందర్ వ్యాయామ ఉపాధ్యాయులు మారుతీప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపరాలలో 'ఇదేం ఖర్మ'



ప్రజలకు కరపత్రాలు అందజేసి అవగాహన కల్పిస్తున్న టిడిపి మండల కన్వీనర్ హనుమంతు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని వేపరాల గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో మంగళవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి పెంచిన నిత్యావసర ధరలు, గ్యాసు, విద్యుత్ ఛార్జీలు, డీజిల్ ధరలతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జుంజురంపల్లి, గ్రామదట్ల, ఆవులదట్ల సర్పంచులు వన్నూరుస్వామి, రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి వీరేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, తిమ్మారెడ్డి, గిరిధర్‌నాయుడు, కదరంపల్లి సోము, జిలాన్, మాబు, ఐ టిడిపి అధ్యక్షులు కిష్టానాయక్, హనుమంతు, తెలుగు యువత ఋషి, సురేష్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహంతోనే 'అప్పర్ భద్ర'కు అనుమతులు

సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-గుంతకల్లు



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ

త్వరలో కర్ణాటకలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బిజెపి అధికార దాహంతో ఆ రాష్ట్రంలో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులతోపాటు నిధులు కూడా కేటాయించిందని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని బిటి పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలో త్వరలో జరిగిన ఎన్నికల్లో అధికారం చేపట్టేందుకు ఎన్నికల తాయిలాల్లో భాగంగా అప్పర్ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులతో పాటు రూ.5,600 కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏపి, తెలంగాణ రాష్ట్రాలకు నీటి కష్టాలు తప్పవన్నారు. దీనిపై సిఎం జగన్‌కు ప్రశ్నించే ధైర్యం లేదన్నారు. వైసిపి నాలుగేళ్లగా ప్రాజెక్ట్ నీటి ప్రాజెక్టుల గురించి ఆలోచనే చేయలేదన్నారు జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి కేంద్ర ప్రభుత్వం నిధులను ఇవ్వకుండా కక్ష సాధింపుగా కర్ణాటకలో అధికారంలోకి వచ్చేందుకు అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి నిధులతోపాటు అనుమతులు జాతీయ హోదా కూడా ప్రకటించడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేవరగుడి జగదీష్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనజ, తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఈక్రాప్ బుకింగ్ తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలో వేల్పుమడుగు, చీకులగురికి గ్రామాల్లో చేపట్టిన ఈక్రాప్ బుకింగ్‌ను ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా భాగంగా రైతులు సాగుచేసిన మొక్కజొన్న, తదితర పంటలను రైతులను స్థానిక అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఇదే విధానంలో ఉరవకొండ డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో జిల్లా అధికారుల ఆదేశాలను అనుసరించి ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రాఘవేంద్ర, అగ్రికల్చర్ అసిస్టెంట్ కుళ్లాయినాయక్, ఎంపిఇఒ లక్ష్మణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు తగదు : ఎంపిపి

ప్రజాశక్తి-కుందుర్పి

మంత్రి ఉషాశ్రీచరణ్‌పై టిడిపి నాయకుల అనుచిత వ్యాఖ్యలు తగదని ఎంపిపి కమల నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ మంత్రి మొదటి నుంచే ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తి అన్నారు. అలాంటి ఉషాశ్రీచరణ్ రూ.5వేలు, రూ.10వేలకు దిగజారే మనస్తత్వం కాదన్నారు. బీసీ కులానికి చెందిన మహిళా మంత్రిపై అవినీతి ఆరోపణ చేయడం బాధాకరమన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరావు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చులు పెడుతున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు పద్ధతి మార్చుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రాజగోపాల్, మాజీ సర్పంచులు తిప్పేస్వామి, లింగప్ప, వైసిపి దళిత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వంక దాటేందుకు కల్వర్ట్ నిర్మాణం

ప్రజాశక్తి-యల్లనూరు



కల్వర్టు వద్ద సర్పంచు రామాంజులరెడ్డి

మండలంలోని తిరుమ్మలాపురం గ్రామంలో వంక దాటేందుకు చేపట్టిన కల్వర్ట్ నిర్మాణం పూర్తయింది. గ్రామస్తులు చాలా సంవత్సరాల నుంచి వ్యవసాయ భూములు, శ్మశాన వాటికకు వెళ్లాలంటే ఈ వంకదాటే వెళ్లాలి. అయితే వర్షాకాలంలో వంక పారిందంటే రైతులు పొలాలకు వెళ్లాలన్నా.. ఎవరైనా చనిపోతే పూడ్చాలన్నా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విషయాన్ని స్థానికులు సర్పంచి రామాంజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లండంతో ప్రభుత్వం నుంచి రూ.3లక్షల నిధులు మంజూరు చేయించి కల్వర్ట్‌ను నిర్మించారు. ఎన్నో ఏళ్లుగా ఉన సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

హుందాయి స్టీల్ నిర్వాహకులకు సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ



హుందాయి స్టీల్ నిర్వాహకులకు సన్మానిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

మండల పరిధిలోని చిన్న ముష్టూరు గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చి హుందాయి స్టీల్ ప్రయివేట్ కంపెనీ నిర్వాహకులను మంగళవారం ఘనంగా సన్మానించారు. కళాశాలలో డిజిటల్ లైబ్రరీ క్యాడ్ ల్యాబ్ ఏర్పాటు చేసుకునేందుకు, రీడెస్ట్ కంప్యూటర్ల ఏర్పాటుకు హుందాయి స్టీల్ ప్రయివేట్ కంపెనీ రూ.5.61 లక్షలు కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ఇవ్వడంతో కళాశాల ఆవరణలో హుందాయి స్టీల్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జామ్ మూన్ కిమ్, కంపెనీ కార్యదర్శి ఎన్.వెంకటరమణ, ఐటి మేనేజర్ మోహన్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ సంగీతను కళాశాల ప్రిన్సిపల్ అస్రాఫ్ అలీ, అధ్యాపకులు సురేష్‌బాబు, చంద్రబాబు, సులోచన, ఆలీహసన్, మోసెస్ తదితరులు ఘనంగా సన్మానించారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం



కార్యకర్తకు ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి సీనియర్ నాయకురాలు బండారు లీలావతి

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని జన చైతన్యనగర్ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త షేక్ మాహబూబ్‌బాషాకు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ తల్లి బండారు లీలావతి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. మహబూబ్‌బాషా కుమారుడు (5రోజులు) వైద్యం కోసం ఆర్థికసాయం చేశారు. దీంతో లీలావతికి టిడిపి నాయకులు పి.తూముచెర్ల బాబా ఫక్రుద్దీన్, వలి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పూల మాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను సాహితీ గగన్ మహల్ సంస్థ అధ్యక్షులు, న్యాయవాది జె.ప్రతాపరెడ్డి, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి మంగళవారం ప్రారంభించారు. వసతి గృహంలో నెలకొన్న తాగునీటి సమస్యను ప్రతాప్ రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండి, సీఈవో ఎన్‌వి రావు దృష్టికి తీసుకెళ్లగా కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ కింద సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంటు బ్యాంకు హోమ్‌లోన్ ఫైనాన్స్ లిమిటెడ్ నిధులు మంజూరు చేసినట్లు హెచ్డబ్ల్యువో పుష్పలత తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారిణి రంగమ్మ, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఇఎన్. మారుతీ ప్రసాద్, ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహ సంక్షేమ అధికారిణి సుజాత, బీసీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి ఖాదర్ హుస్సేన్ పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చెత్త తరలింపు వాహనం దగ్ధం

పట్టణంలో కమ్ముకున్న పొగ

రాయదుర్గం : పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద ఉన్న కంపోస్ట్ యార్డులో మంగళవారం చెత్త తరలింపు వాహనం కాలిపోయింది. పట్టణంలో సేకరించిన చెత్తను కాంపాక్టర్– లోడర్ వాహనం కంపోస్ట్ యార్డులో చెత్తను అన్లోడ్ చేస్తుండగా వాహనం చక్రాలు చెత్తలో ఇరుక్కుపోయి వాహనం ముందుకు దూసుకు వెళ్లే క్రమంలో సైలెన్సర్ పైపు నుండి మంటలు చెలరేగి చెత్తకు నిప్పు అంటుకుంది. దీంతో చెత్తతో పాటు వాహనం కూడా కాలింది. అగ్నిమాపక దళం వచ్చి మంటలను ఆర్పినప్పటికీ వాహనం దాదాపు పూర్తిగా కాలిపోయింది. మంటలు ఆరిపోయినప్పటికీ కాలిన చెత్త నుంచి పొగ పెద్ద ఎత్తున పట్టణంలోని శాంతినగర్, పార్వతీనగర్ తదితర ప్రాంతాల్లో కమ్ముకుంది. సుమారు రూ.10లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా. అగ్ని ప్రమాద విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

16న కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం

ఉరవకొండ : విడపనకల్ మండల కేంద్రంలోని సినిమా హాల్లో ఈ నెల 16న నిర్వహించనున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశాన్ని జయప్రదం చేయాలని జెసిఎస్ విడపనకల్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపిపి కరణం పుష్పవతి భీమ్ రెడ్డి, జడ్పీటీసీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు, చిత్తూరు జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు(వాసు), యువనేత వై.ప్రణయ్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని వైసిపి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, వైసిపి కుటుంబ సభ్యులందరూ తప్పక హాజరుకావాలన్నారు.

ఒడ్డుపల్లిలో సిద్ధయ్యస్వామి పుణ్యారాధన

ఆత్మకూరు : మండల పరిధిలోని ఒడ్డుపల్లి గ్రామంలో వెలసిన పూదోట లింగావధూత పరంపర శ్రీసిద్ధయ్యస్వామి 38వ పుణ్యారాధనను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం సిద్ధయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత సిండికేట్ నగర్‌కు చెందిన గీతాపారాయణం బృందం భగవద్గీత పారాయణం చేసింది. మధ్యాహ్నం నుంచి రాత్రివరకు గ్రామస్థులు అన్నదానం చేశారు. పలువురు ఆధ్యాత్మిక వేత్తలు తమ ప్రసంగాల్లో గురు సంప్రదాయ విశిష్టతను వివరించారు. ఉపన్యాసాల అనంతరం భజనలతో రాత్రివేళ జాగరణ చేశారు.

నేడు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

నార్పల : మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు వెటర్నరీ డాక్టర్ గోవిందరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే చాలా వరకు పశు గర్భకోశ సమస్యలు ఉన్న రైతులను గుర్తించి సమాచారం ఇచ్చామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

21న మెగా ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరం పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ఉరవకొండ : నియోజకవర్గ పరిధిలోని వజ్రకరూరు మండల కేంద్రంలో ఉన్న టిటిడి కల్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే వసికేరి గోపీనాథ్ జ్ఞాపకార్థం ఈనెల 21న నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వజ్రకరూరు జడ్పిటిసి తేజేశ్వరి రమేష్, కురుబ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు వసకేరి రమేష్‌బాబు తెలిపారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతారాం ఆస్పత్రి సౌజన్యంతో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సహకారంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ప్రధానంగా గుండె, కంటి ఆపరేషన్లు, మోకాలు, భుజం, మెడకు సంబంధించిన సమస్యలకు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, వజ్రకరూరు సర్పంచి మోనాలిసా, సర్పంచులు కమలమ్మ, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించండి

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లాలో జరగనున్న ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో కలెక్టరు పరీక్షల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించి తగు సూచనలు, దిశ నిర్దేశం చేశారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు పరీక్షలు నిర్వహించ బోతున్నామన్నారు. అధికారులందరూ సమన్వ యంతో పనిచేసి పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలలో లైట్లు, టాయిలెట్లు, అవసరమైన బల్లలు, ఇప్పటివరకు పూర్తి అయిన ఏర్పాట్లను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. మార్చి 15 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు మొదటి రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు అలాగే ఈనెల 15వ తేదీ నైతిక విలువలు, మానవ విలువలు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. 17న పర్యావరణ విద్యపై మొదటి సంవత్సర విద్యార్థులకు పరీక్ష ఉంటుందన్నారు. ఈనెల 20 నుంచి మార్చి 7 వరకు ఒకేషనల్ మొదటి రెండవ సంవత్సరపు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణ ఈనెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. ఈనెల 15, 17 తేదీలలో జరిగే పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరు అయిన విద్యార్థులు నాట్ క్వాలిఫైడ్‌గా పరిగణించబడతారన్నారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా, అందుబాటులో వైద్య సిబ్బంది ఉండాలన్నారు. తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నైతిక మానవ విలువలు పరీక్షలు 133 కేంద్రాలలో ఉంటాయని ప్రాక్టికల్ పరీక్షలు రెండు విడతలుగా ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు, థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు పరీక్షల నియమ నిబంధనలు పాటించాలన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని, పరీక్ష కేంద్రాలలోకి సెల్ ఫోన్లు తీసుకురాకూడదని హెచ్చరించారు. పరీక్షల సమయంలో చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లనూ కార్మిక శాఖ మూసి వేయించాలన్నారు. జిల్లాలో మొదటి సంవత్సర విద్యార్థులు 9307 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 12904 మంది మొత్తం 21904 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. విద్యార్థులు నిర్ణీత సమయం కంటే అరగంట ముందుగానే హాజరు కావాలని, పరీక్షలు జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ విధించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. తహశీల్దార్లు, పోలీస్ శాఖ ఎంప్లాయిస్ స్క్వాడ్‌గా ఏర్పడి పరీక్ష కేంద్రాలకు పరీక్ష పేపర్లు చేర్చాలన్నారు. పరీక్ష కేంద్రాలకు అవసరమైన బస్సులు నడపాలన్నారు. ఈ సమావేశంలో డిఐసి కన్వీనర్ డాక్టర్ సురేష్ బాబు, డీఈఈవో రఘునాథరెడ్డి, ఏవో జి.వెంకట్రావు, ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.